రాజ్యాంగంపై బీజేపీకి గౌరవం లేదు

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ● ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్‌కు వినతి

కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 24 : ఆర్ఎస్ఎస్, బీజేపీకి రాజ్యాంగం, మూడు రంగుల జెండాపై ఏనాడూ కనీస గౌరవం లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కోరుతూ మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ప్రాధాన్యత కల్పించారన్నారు. అత్యధిక జనాభా కలిగిన దేశం, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండడానికి కారణం అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పుణ్యమేనని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు అభివృద్ధి చెందితే బీజేపీ ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. ఒకవేళ బీజేపీకి 400సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేసేవారన్నారు. బీజేపీ చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ప్రముఖ కవి రామకృష్ణకు పురస్కారం

రామకృష్ణను సత్కరించి ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 24 : రవీంద్రభారతిలో విశ్వభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భూదాన్ పోచంపల్లికి చెందిన కవి గజ్జెల రామకృష్ణకు పురస్కారం లభించింది. ఔసల భానుప్రకాశ్ రచించిన కర్మీ పుస్త కావిష్కరణ సభలో ప్రముఖ కవి టి.గౌరీ శంకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. నేత వృత్తిలో కొనసాగుతూ దీపం ఉండగానే 'చంద్రుడు లేని ఆకాశం' కవితా సంపుటాలు తీసుకురావడం విశేషమని ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. కార్యక్రమానికి సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లి కసిరెడ్డి నారాయణరెడ్డి, కవులు పాల్గొన్నారు.

పాలన చేతగాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 24 : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతగాక సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు రాచకొండ గిరి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా పూర్తి స్థాయిలో మంత్రివర్గ విస్తరణ చేయకపోవడం సిగ్గు చేటన్నారు. సబ్బండ వర్గాలను అక్కున చేర్చుకున్న కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పు రామకృష్ణ, సండా శ్రీకాంత్, గుండమల్ల అరవింద్, చెర్క శేఖర్ పాల్గొన్నారు.

'రాజాపేటలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం'

జాతీయ అవార్డు అందుకున్న ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

రాజాపేట, డిసెంబర్ 24 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని కురుమ సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం కురుమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు వస్పరి సుధాకర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన మహనీయుడు దొడ్డి కొమరయ్య అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహం ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 27న రాజాపేటలో నిర్వహించే కురుమ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ అవార్డు అందుకున్న బీసీ నేత జూకంటి ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల నాయకులు మీస బాలమల్లయ్య, పుప్పాల నర్సయ్య, రేగు సిద్ధులు, చీర మహిపాల్, మర్ల నాగరాజు, సిద్ధేశ్వర్, బాలరాజు, శ్రీకాంత్, కుమార్, శ్రీను, భాస్కర్ ఉపేందర్, సిద్ధులు పాల్గొన్నారు.

'ఆశ వర్కర్ల బస్సు జాతాను విజయవంతం చేయాలి'

బస్సు జాతా పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

చౌటుప్పల్, డిసెంబర్ 24 : భువనగిరికి ఈ నెల 29న వస్తున్న ఆశ వర్కర్ల బస్సు జాతాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా అన్నారు. చౌటుప్పల్ బస్సు జాతా పోస్టర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. అధికారంలోకి రాగానే వేతనాలు పెంచడం తోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని మాట ఇచ్చి తప్పిందని విమర్శించారు. ఇందు కోసం చేపడుతున్న బస్సు జాతాకు ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, కలకుంట్ల శివకుమార్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, నెల్లికంటి నర్సింహ, బోదాసు నరేశ్, రమేశ్ పాల్గొన్నారు.

'గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

రామన్నపేట, డిసెంబర్ 24 : యాభై ఏండ్లు నిండిన గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని గీత పనివారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేశ్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన గీత పనివారుల సంఘం మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తిలో భాగంగా ఎముకలు ధృఢత్వాన్ని కోల్పోయి 50 ఏండ్లలోపే ఎటూ చేతగాని స్థితికి పోతున్నారన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడు గంగాపురం వెంకటయ్య, నాయకులు బాలగోని మల్లయ్య, ఎర్ర వెంకటేశం, భూపతి నర్సింహ పాల్గొన్నారు.

వినియోగదారులు చైతన్యవంతం కావాలి

● కలెక్టర్ హనుమంతరావు

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, హాజరైన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 24 : వినియోగదారులు నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని, నకిలీ వస్తువుల మోసాల నుంచి బయట పడేందుకు వినియోగదారుల్లో చైతన్యం అవసరమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నాణ్యమైన వస్తు సేవలను పొందడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని తెలిపారు. మారుమూల గ్రామాల రైతులకు వినియోగదారుల హక్కుల సంఘాలు అండగా నిలబడి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని సూచించారు. విద్యావంతులకే కాక సామాన్యులకు సరైన న్యాయం జరిగినప్పుడే వినియోగదారుల దినోత్సవానికి సార్థకత అని తెలిపారు. పాటల రూపంలో వినియోగదారులను చైతన్య పరుచాలని వినియోగదారుల సేవా సంఘాలను కోరారు.

అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ మనిషి పుట్టుక నుంచి మరణం దాకా అడుగడుగునా వినియోగదారుడే అన్నారు. మారుతున్న సమాజంలో అన్ని రంగాల్లో డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ సేవలు అందుతున్నట్లే వాటికి సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కూడా ఆన్‌లైన్ వర్చువల్ విధానంలో జరుపాలని పేర్కొన్నారు. దీని వల్ల వినియోగదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ మహిళల ద్వారా డిజిటల్ విద్యతో సమాంతరంగా వినియోగదారుల విద్యా విజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారి జగదీశ్‌కుమార్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అశ్వినీకుమార్, జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ రోజారాణి, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డిపోకు మరో 26 బస్సులు

గుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 24 : యాదగిరిగుట్ట డిపోకు మరో 26 ఆర్టీసీ బస్సులు అవసరమని ప్రతిపాదనలు పంపామని, బస్సులు వచ్చిన వెంటనే అవసరాలను బట్టి గ్రామాలకు బస్సులను నడిపించేందుకు ప్రయత్నిస్తామని యాదగిరిగుట్ట డిపో మేనేజర్ బందారపు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పలువురి నుంచి వచ్చిన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారని ఆయన తెలిపారు. ప్రస్తుతం డిపోలో 102 బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బస్సుల సంఖ్య మరింత పెరుగాల్సి ఉందని చెప్పారు. ఫిర్యాదులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు.

28నుంచి 31వరకు ఏపీజీవీబీ సేవలు బంద్

బీబీనగర్, డిసెంబర్ 24 : ఏపీజీవీబీ తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుతున్న నేపథ్యంలో ఈ నెల 28నుంచి 31వరకు బ్యాంకు సేవల్లో అంతరాయం ఏర్పడుతుందని బీబీనగర్ శాఖ మేనేజర్ శంకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే, ఫోన్ పే తదితర ఆన్‌లైన్ సేవలకు సైతం అంతరాయం ఏర్పడుతుందని, ఈ నాలుగు రోజులు వినియోగదారులు సహకరించాలని కోరారు. 2025 జనవరి 1నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

నిందితుడికి రిమాండ్

వలిగొండ, డిసెంబర్ 24 : మండల కేంద్రానికి చెందిన కళ్లెం శ్రీను ఇటీవల ఓ వ్యక్తిని పలు మార్లు బెదిరించాడు. ఆ వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి శ్రీను పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. మంగళవారం మండల కేంద్రంలోని తొర్రూర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా శ్రీనును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న శ్రీనును విచారించిన పోలీసులు.. రామన్నపేట న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నల్లగొండ జైలుకు తరలించినట్లు ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు.

ఆలేరు రైల్వే క్వార్టర్స్‌లో చోరీ

ఆలేరు టౌన్, డిసెంబర్ 24 : ఆలేరు రైల్వే స్టేషన్ రెండో నెంబరు ప్లాట్‌ఫారం వైపుగల రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న కె.సంజీవ ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగంతకులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. మూడు తులాల బంగారు నగలను అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రజనీకర్ తెలిపారు.

27న మండల సమావేశం

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 24 : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న మధ్యాహ్నం 2:30 గంటలకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే, నర్సరీ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల, గ్రామ స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఒగ్గు కళాకారుడు శంకరయ్య మృతికి సంతాపం

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 24 : మండలంలోని దంతూరు గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు, మాజీ ఉప సర్పంచ్ జమ్ము శంకరయ్య(70) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం పలువురు నాయకులు సందర్శించి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. సామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దోటి కుమార్, నాయకులు శ్రీశైలం, చిన్న ఈదయ్య, రవీందర్, శ్రీనివాస్, సైదులు, సాయిలింగం, బాలయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డిపై అసత్య ప్రచారం తగదు

● బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 24 : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. స్థలం కబ్జా చేసినట్టు ప్రచారం చేయడంలో నిజం లేదన్నారు. ఆయనపై కుట్రపూరితంగా అవాస్తవాలతో అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే కనబడుట లేదనడం సరికాదని, ఇటీవల జరిగిన అనేక ఆందోళన కార్యక్రమాల్లో పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొన్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. అసత్య ప్రచారాలు చేస్తున్న టీవీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, కౌన్సిలర్లు ఖాజా అజీముద్దీన్, దిడ్డికాడి భగత్, నాయకులు అబ్బగాని వెంకట్, బబ్లూ, ఇస్మాయిల్, శివకుమార్, సుభాశ్, నితీశ్ పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యేను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఎస్ఐ యుగేంధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

వలిగొండ, డిసెంబర్ 24 : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కించపరిచే విధంగా అసత్య ప్రచారాలు చేస్తున్న రిపోర్టర్ దిలీప్‌గౌడ్‌తోపాటు బిగ్ టీవీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం పోలీస్టేషన్‌లో ఎస్ఐ యుగేంధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రతిష్టను దిగజార్చే విధంగా అసత్య ఆరోపణలు చేస్తూ టీవీ ద్వారా ప్రసారం చేయడానికి కారకుడైన రిపోర్టర్ దిలీప్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన పిసాటి అంజిరెడ్డి పైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు డేగల పాండు యాదవ్, ఎడ్ల నిరంజన్‌రెడ్డి, కల్లెం మారయ్య, సోమనబోయిన సతీశ్, ఎడవెల్లి శాంతికుమార్, రాజుగౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

పెంచిన కూలి రేట్ల జీఓ విడుదల చేయాలి : ఏఐటీయూసీ

సివిల్ సప్లయ్ డీఎం జగదీశ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 24 : సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెంచిన కూలి రేట్ల జీఓను ఈ నెల 31 వరకు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. పెంచిన కూలి రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ డీఎం ఎస్.జగదీశ్‌కుమార్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ, స్వీపర్లకు, కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రేట్లు పెంచేందుకు గత ప్రభుత్వాలు జీఓ విడుదల చేశాయన్నారు. దాని ప్రకారం జనవరి 2024 నుంచి నూతన రేట్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ విషయమై అక్టోబర్ 4న సివిల్ సప్లయ్ కమిషనర్ సమీక్షలో చర్చలు జరిపి రేట్లు పెంచుటకు ఒప్పందం జరిగిందని, 3 నెలలు పూర్తి కావస్తున్నా ఇంకా అమలు చేయడం లేదని అన్నారు. పెంచిన కూలి రేట్ల జీఓను విడుదల చేయకుంటే జనవరి 1నుంచి ఎగుమతి, దిగుమతి నిలుపుదల చేసి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాపగళ్ల శంకరయ్య, కార్యదర్శి గౌరవంతుల శ్రీనివాస్, నాయకులు కృష్ణ, రాములు, శ్రీను పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ధర్నా

తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బొమ్మలరామారం, డిసెంబర్ 24 : రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం అన్నారు. రైతులు దరఖాస్తులు అందజేసి నెలలు గడుస్తున్నా పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్యారారం వెంకటేశం, సాయి, రవి, పున్నమ్మ, మధు, బ్రహ్మచారి పాల్గొన్నారు.

వీఆర్ఓ వ్యవస్థ పునరుద్ధరణపై హర్షం

యాదగిరిగుట్ట : గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి గుర్రాల బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు కుక్కల శ్రీనివాస్ డి.కృష్ణ, జిల్లా నాయకులు వెంకట నరసింహారెడ్డి, శ్రీరెడ్డి ఝాన్సీ, జి.కవిత, కె.కృష్ణ పాల్గొన్నారు.

జలాల్‌పూర్ చెరువు కట్ట వద్ద ఇనుప కంచెలు ఏర్పాటు

భూదాన్ పోచంపల్లి డిసెంబర్ 24 : మండలంలోని జలాల్‌పూర్ చెరువు కట్ట మూలమలుపు వద్ద పోలీసులు మంగళవారం ఇనుప కంచె బోర్డులను ఏర్పాటు చేశారు. మూలమలుపులో అతివేగంగా వచ్చే వాహనాలు తరచుగా ప్రమాదాలకు గురవుతుండడంతో పోలీసులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 11 ఇనుప కంచె బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసులు ముత్తయ్య, వెంకటేశ్, శ్రీను, శ్రీనివాస్, వినోద్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

ఇనుప కంచెలు ఏర్పాటు చేసిన పోలీసులు

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

యాదగిరిగుట్ట : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 24 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే అవాంతరాలు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా చేయాలని అదనపు కలెక్టర్ గంగాధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని దాతారుపల్లి ఆవాస గ్రామమైన గొల్లగుడిసెలలో ఇండ్లు లేని నిరుపేదలు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా చేస్తున్న ఇంటింటి సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ సలీం, పంచాయతీ కార్యదర్శి అనూరాధ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

బొమ్మలరామారం : ఎంపీడీఓ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ గంగాధర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగు సూచలను, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు డీఆర్డీఓ సురేశ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 24 : మండలంలో 2023 - 24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 14వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై వారం రోజులపాటు వివరాలను సేకరించిన తనిఖీ బృందం సభ్యులు నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశానికి హాజరైన అదనపు డీఆర్డీఓ గుర్రం సురేశ్ మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాల్లో రూ.3.36కోట్ల ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు. ప్రతి గ్రామంలో రోజూ కూలీలకు పనులు కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ ఆదిత్య, అంబుడ్స్‌మెన్ వీరమల్లు, ఎంపీడీఓ రాములునాయక్, ఎస్ఆర్‌పీ గంగరాజు, ఏపీఓ రమేశ్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 24 : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ రాజేశ్‌చంద్ర మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని చర్చిని పరిశీలించి మాట్లాడారు. క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఆయన వెంట ఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యం : ఏసీపీ

షీటీమ్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి

చౌటుప్పల్, డిసెంబర్ 24 : మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యమని చౌటుప్పల్ ఏస